రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





## ఆకాశంలో మ్యాజిక్!
### సూర్యుడి చుట్టూ అందమైన వలయం

**ఘట్‌కేసర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ఆదివారం ఉదయం 11:35 నుండి మధ్యాహ్నం 12:10 గంటల మధ్య ఫుట్‌కేరర్ ఆకాశం ఒక వర్ణమయ కాన్వాస్‌లా మారిపోయింది. సూర్యుడి చుట్టూ ఒక ఇంద్రధనస్సు చుట్టుముట్టినట్లు కనిపించిన ఆ దృశ్యం స్థానికులను అబ్బురపరిచింది. భౌతికశాస్త్రం ప్రకారం ఈ వింతను హేలోస్ అంటారు. దట్టమైన మేఘాలు ఏర్పడి వాటిలో ఘనీభవించిన నీటి బిందువులపై సూర్య కిరణాలు పడినప్పుడు ఇలాంటి దృశ్యం ఆవిష్కృతమవుతుందని బౌతికశాస్త్ర టీచర్లు తెలిపారు. మంచు బిందువులపై పడిన కిరణాలు పరావర్తనం చెంది ఇలా ఇంద్రధనస్సు రంగుల్లో కనిపిస్తాయని చెప్పారు. సాధారణ పరిభాషలో దీన్ని వరద గూడు అని అంటారని, ఇలా ఏర్పడితే ఆ సంవత్సరమంతా సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతులు నమ్ముతారని తెలిపారు. ఆకాశంలో ఇలాంటి అద్భుత దృశ్యం చాలా అరుదుగా చూసామని స్థానికులు పేర్కొన్నారు.



### నేటి నుంచి కేబీఆర్ చుట్టూ వన్‌వే

3లో

హెచ్‌సిటీ నిర్మాణ పనుల కోసం ట్రాఫిక్ మళ్లింపు..

వాహనదారులకు కొత్త రూట్లు

సిపి సజ్జనార్ వెల్లడి



# 10 ఊళ్లకు ప్రయాణం నరకప్రాయం

**30 ఏళ్లుగా కనీస మరమ్మతులు నిల్**

**1996లో చంద్రబాబు హయాంలో నిర్మించిన బిటిరోడ్డు**

**అడుగడుగునా గుంతలమయం**

**ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని స్థితి..**

**అభివృద్ధి చేయాలని స్థానికుల వేడుకోలు**

**తలకొండపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాలను అనుసంధానించే కల్వకుర్తి మార్చాల 9 రేకుల రహదారి అత్యంత అధ్వాన్న స్థితికి చేరింది. గత 30 ఏళ్లుగా కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో ఈ రహదారిపై ప్రయాణించడమంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని వెళ్లడమేనని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్న సమయంలో (1996లో) జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతాన్ని సందర్శించారు. అప్పటి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి విజ్ఞప్తితో ఈ 30 కిలోమీటర్ల మార్గానికి బిటి రోడ్డు మంజూరు చేసి నిర్మించారు. ఈ రహదారి అందుబాటులోకి రావడంతో ఆమంగల్ మీదుగా వెళ్లే అవసరం లేకుండా కల్వకుర్తి షాద్‌నగర్ మధ్య ఏకంగా 20 కిలోమీటర్ల దూరం తగ్గింది. అయితే, ఆ తర్వాత వచ్చిన ఏ ప్రభుత్వమూ ఈ రహదారి నిర్వహణను పట్టించుకోలేదు.

**ద్విచక్ర వాహనం వెళ్లాలన్నా సాహసమే**

మూడు దశాబ్దాలుగా మరమ్మతులు లేకపోవడంతో బిటి రోడ్డంతా గుంతలమయమై, కనీసం మట్టి కూడా వేయకపోవడంతో అధ్వాన్నంగా తయారైంది. కనీసం టూవీలర్‌పై వెళ్లేందుకు కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. గతంలో అరగంటలో చేరుకునే ప్రయాణానికి ఇప్పుడు గంటకు పైగా సమయం పడుతోందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే కల్వకుర్తి, ఊర్కొండ, తలకొండపల్లి, కేశంపేట మండలాల్లోని మార్చాల, యెంగంపల్లి, జకినాలపల్లి, గట్టు ఇప్పలపల్లి, మేదక్‌పల్లి, రాంపూర్, చంద్రధన, లింగంధన, 9 రేకులు తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఆసుపత్రులకు లేదా మండల కేంద్రాలకు వెళ్లాలన్నా తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఎమ్మెల్యేలు స్పందించాలి:ఇప్పటికైనా స్థానిక కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అధికారులు తక్షణమే స్పందించి, నిధులు మంజూరు చేసి ఈ బిటి రోడ్డును పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

# యూనిఫామ్‌లకూ సైజుల్లేవ్

**కొంతమంది విద్యార్థులకు లూజ్, కొందరికి టైట్**

**విద్యార్థినుల పరిస్థితీ అంతే..**

**స్వయం సహాయ బృందాలకు టైలరింగ్ బాధ్యతలు**

**చివరి నిమిషంలో డ్రస్సింగ్ కొలతలు స్వీకరణ**

**ఇష్టారాజ్యంగా స్టిచింగ్**

**బాధ్యులైన ఉద్యోగుల పర్యవేక్షణ లోపం**

**తీవ్ర అసంతృప్తిలో డీఈవో**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** సీఎం రేవంత్ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట ఇది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల యూనిఫారాలు చౌకబారుగా ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. టైలర్లు విద్యార్థుల సైజులకు సరిపడా కుట్టకపోవడం వల్ల కొందరికి బిగుతుగా, మరికొందరికి లూజుగా ఉన్నాయి. ఈ యూనిఫారాలను తమ పిల్లలు ధరించలేరని విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పంపిణీ చేసిన బూట్ల సైజులు కూడా సరిగ్గా లేవని విమర్శలు వచ్చాయి. బూట్ల డబ్బాలు పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేక ఉపాధ్యాయులు వాటిని స్కూళ్లలో భద్ర పరిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు యూనిఫారాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 35 వేల మంది ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు వారం రోజులుగా యూనిఫారాలను పంపిణీ చేస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా స్వయం సహాయ బృందాలకు టైలరింగ్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఇటీవల విద్యార్థుల నుంచి వారు కొలతలు తీసుకున్నా చివరి నిముషంలో వారి ఇష్టం వచ్చినట్లు స్టిచింగ్ చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ యూనిఫారాలను ధరించేందుకు విద్యార్థులు సుతరామూ ఇష్టపడటం లేదు. బక్కపలచని విద్యార్థులకు లూజు బట్టలు పంపిణీ చేయగా, లావుపాటి విద్యార్థులకు బిగుతుగా ఉన్న యూనిఫారాలను అందజేశారు. పలు యూనిఫారాలకు బటన్లు కూడా సరిగ్గా కుట్టలేదు. విద్యార్థినిల పరిస్థితి కూడా దాదాపు ఇదే విధంగా తయారైంది. వారి కొలతలకు ఏ మాత్రమూ పొంతన లేని విధంగా యూనిఫారాలను తయారు చేసి పంపిణీ చేశారు. ఈ వ్యవహారంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ఉద్యోగులు, కొంతమంది మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు విమర్శలు వచ్చాయి. ఒక్కో జత యూనిఫారం కుట్టేందుకు రూ.75 నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై పూర్తిస్థాయి సమాచారం ఇచ్చేందుకు అధికారులు వెనకంజ వేస్తున్నారు.



ప్రస్తుతం స్కూళ్లలో పంపిణీ చేసిన యూనిఫారాలపై జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. దౌల్తాబాద్ మండల పర్యటనలో పలు స్కూళ్లలో యూనిఫారాల పంపిణీ పర్యవేక్షించినట్లు తెలిపారు. విద్యార్థుల సైజులకు సరిపడా బట్టలు కుట్టలేదని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూడనున్నాయి.







కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న బ్లూకోల్ట్ పోలీసులు

## చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

**సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్ పోలీసులు**

**ఎస్పీ స్నేహామెహ్రా ప్రశంసలు**

**దౌల్తాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను దౌల్తాబాద్ బ్లూకోల్ట్ సిబ్బంది సమయస్ఫూర్తితో ప్రాణాలతో కాపాడారు. ఈ మానవతా దృక్పథాన్ని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా ప్రత్యేకంగా అభినందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఏలమకంటి లాలమ్మ (35),తన భర్త లక్ష్మప్ప సుమారు 15 సంవత్సరాల క్రితం మరణించారు. అప్పటి నుండి ఆమె తన కుమారుడు శ్రీకాంత్ (16), కూతురు (12)లతో కలిసి జీవిస్తున్నారు. అయితే కుటుంబ, వ్యక్తిగత సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన లాలమ్మ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆమె ఏడుస్తూ దౌల్తాబాద్ చెరువు వైపు వెళ్తుండగా, అదే సమయంలో ఆ మార్గంలో బ్లూకోల్ట్ విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, రాఘవేందర్ గమనించారు. ఆమె చెరువులో దూకెందుకు ప్రయత్నించడాన్ని పసికట్టిన ఆ ఇద్దరు పోలీసు సిబ్బంది ఆలస్యం చేయకుండా అప్రమత్తమయ్యారు. వెంటనే ఆమెను అడ్డుకుని ప్రాణాపాయం నుండి సురక్షితంగా రక్షించారు. అనంతరం ఆమెకు ధైర్యం చెప్పి, ప్రేమపూర్వక కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆమె పిల్లలు శ్రీకాంత్, కూతుర్ల సమక్షంలో కుటుంబ సభ్యుల వద్దకు సురక్షితంగా చేర్చారు. ఆపదలో ఉన్నవారిని కాపాడటంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని, సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది పిసీ చంద్రశేఖర్, పిసీ రాఘవేందర్‌ల సేవలను జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా అభినందించారు.

## ఏ ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండండి

**కార్యకర్తలకు డిసిసి చీఫ్ ధారాసింగ్ నాయక్ పిలుపు**

**వికారాబాద్, ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలోని గాంధీభవన్‌లో వికారాబాద్ జిల్లా పీఏసీ సమావేశం డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్ నాయక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. వికారాబాద్ డీసీసీకి సంబంధించిన కీలక అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత వ్యవహారాలపై మీనాక్షి నటరాజన్ సమీక్షిం చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా వ్యవహరించేలా ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. పార్టీ పటిష్టతకు భంగం కలిగించే వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా విజయ కేతనం ఎగుర వేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వికారాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, బుయ్యని మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు నీరజ బాల్ రెడ్డి, గడ్డం అనన్య, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సతీష్ రెడ్డి, మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా ఆమీర్, ఎస్టీ సెల్ జిల్లా ప్రెసిడెంట్, శివరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనుల వివరాలు ప్రజలకు చెప్పండి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ నాయకులు (పిఎసి-పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ-సభ్యులు)తో తెలంగాణ రాష్ట్ర ఏఐసిసి ఇన్‌చార్జి నటరాజన్ మీనాక్షి గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. ఆదివారం నగరంలోని గాంధీభవన్‌లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో పాటు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో, పిఎసి సభ్యులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు.

దీనిలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత వ్యవహారాలు, రాజకీయ అంశాలు, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ఎస్ఐఆర్ పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, అభివృద్ధిని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఏఐసిసి ఇన్‌చార్జి నటరాజన్ మీనాక్షి సూచించారు.



పిఏసి సమావేశంలో పాల్గొన్న ధారాసింగ్



సమావేశంలో పాల్గొన మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్

ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో పాటు పిఎసి కమిటీ సభ్యులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, కమ్మ కార్పోరేషన్ చైర్మన్ బండి రమేశ్, మల్కాజ్‌గిరి ఎంపిగా పోటీ చేసిన పి.సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎం. సుధీర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంత్‌రావు, కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కొలను హన్మంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, సేవాదళ్ అధ్యక్షులు షఫీయుద్దీన్, మైనార్టీ సెల్ అధ్యక్షులు అజీజ్‌బేగ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.





## రిస్క్ తీసుకోకపోతే విజయం దక్కదు

**మహిళా ఇంజనీరింగ్ విద్యార్థినులకు కెటిఆర్ ఉద్బోధ**

**ఘట్‌కేసర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని బీఆర్‌ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్-సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లోని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి జరిగిన స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉత్సాహంగా సాగిన గ్రాడ్యుయేషన్ దినోత్సవంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు కేటీఆర్ చేతుల మీదుగా పట్టాలను ప్రదానం చేశారు. ఈసందర్భంగా కళాకారులు, విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకర్షించాయి. కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన టీహబ్ వంటి కార్యక్రమాల ద్వారా ఎంతోమందికి స్టార్టప్‌లు, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని గుర్తుచేశారు. భావితరాల ఆవిష్కరణల కోసం కృషి చేసే ఇంజినీరింగ్ విద్యార్థులను అవమానించేలా, వారిని క్రిమినల్ వేస్ట్ అంటూ సీఎంరేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చాలా

>>3





చోరీ వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

## తాళం వేసిన ఇళ్లు, షట్టర్లే టార్గెట్

**వరుస చోరీలకు పాల్పడుతున్న పార్ధీ గ్యాంగ్ అరెస్టు**

**శంకర్‌పల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎలవర్తి గ్రామంలో చోరీకి పాల్పడిన నిందితుల్లో ఇద్దరిని శంకర్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సమయంలో, శంకర్‌పల్లి పోలీస్ సిబ్బంది రైస్ మిల్ రోడ్డు గుడిసెల దగ్గర అనుమా నాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించి వారిని అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించబడ్డారు. విచారణలో భాగంగా 11న అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో ఎలవర్తి గ్రామంలోని ఒక ఇంటిలో చోరీకి పాల్పడినట్లు వెల్లడించారు.

నిందితులు ఎలవర్తి గ్రామంలో తిరుగుతూ ఒక ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించారు. చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకున్న అనంతరం, తమ వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్ సహాయంతో ఇంటి తాళాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించారు.అనంతరం ఇంటిలోని అల్మారాకు ఉన్న తాళాన్ని కూడా పగులగొట్టి, అందులో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు మరియు నగదును అపహరిం చుకుని అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం నిందితులు గ్రామం విడిచి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న శంకర్‌పల్లి పోలీసులకు పట్టుబడ్డారు.విచారణలో వీరు గత ఆరు నెలలుగా శంకర్‌పల్లి, బీడీఎల్ భానూర్, గజ్వేల్ మరియు పరిసర ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లు, షట్టర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న పర్ధీ గ్యాంగ్‌కు చెందిన నిందితులను శంకర్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, ఇప్పటివరకు 11 చోరీ కేసులకు సంబంధించి నేరాలను అంగీ కరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

ఈ గ్యాంగ్‌లో సుమారు 20 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన ఐదుగురు పురుషులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరు మహారాష్ట్రలోని సోలాపూర్, జాల్నా జిల్లాల పరిసర ప్రాంతాల నుంచి రైలు మార్గంలో మహిళలు, చిన్న పిల్లలతో కలిసి శంకర్ పల్లి, లింగంపల్లి , టోలిచౌకి ప్రాంతాలకు వచ్చి నిర్మాణంలో ఉన్న భవనాల సమీపంలో తాత్కాలికంగా చిన్న టెంట్లు ఏర్పాటు చేసుకుని నివసించేవారు. పగటి సమయంలో మహిళలు, చిన్న పిల్లలతో కలిసి గ్రామాలు మరియు పరిసర ప్రాంతాల్లో అడుక్కుంటూ సంచరిస్తూ, ఆయా ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లు, షట్టర్లు మరియు నిర్మానుష్య ప్రాంతాలను గుర్తించేవారు. రాత్రి సమయంలో పురుషులు పొలాలు, చెట్ల పొదలు మరియు ఇతర నిర్మానుష్య ప్రాంతాల గుండా కాలినడకన, కొన్ని సార్లు బైక్ పై వెళ్లి, శివార్లలో ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడేవారు. నిందితులు ముందుగా పరిసర ప్రాంతాలకు వీరు ముఖలకు

>>3



టాస్క్ సీఓఓ రాఘవేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న చంద్రాయణపల్లి తండా వాసులు

## తండాలో ఉపాధి అవకాశాలపై సమీక్ష

**ఆమనగల్లు, ఆగస్టు16, ప్రభాతవార్త:** తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆదివారం ఆమనగల్లు మండలంలో పర్యటించారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లి గ్రామంలో పర్యటించిన సుంకిరెడ్డికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. తండాలోని యువతతో ప్రత్యేకంగా సమావేశమై ఉపాధి అవకాశాల గురించి చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం టాస్క్ ఆధ్వర్యంలో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అర్హులైన యువతీయువకులు సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. రాష్ట్ర పోలీస్‌శాఖలో ఖాళీల భర్తీ చేపట్టేందుకు నోటిఫికేషన్ విడుదలైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఉపాధి అవకాశాలను కల్పించేందుకు టాస్క్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పేరొందిన ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక శిక్షణలు కూడా అందిస్తున్నట్లు రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించబోతున్న వినాయకమండపం వద్ద ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో పర్యటించి ఆగ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. నరేందర్‌రెడ్డి మాతృమూర్తి భారతమ్మ కన్నుమూశారు. విషయం తెలుసుకున్న రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని కలుసుకుని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీను, వార్డు సభ్యులు కృష్ణయ్య, మల్లేశ్, అశోక్, మల్లేశ్, శివ, రాజశేఖర్, సురేందర్, సంతోష్, మహేశ్, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు శివ, శ్రీరాములు, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

## పోచారం డివిజన్‌లో ఘనంగా బోనాల వేడుకలు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని పలుగ్రామాల్లో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని పూజలు చేశారు. పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ, పోచారం, కొర్రెముల, కాచవాని సింగారం గ్రామాల్లోని మైసమ్మ, ఈదమ్మ, మహంకాళమ్మ, ముత్యాలమ్మ తదితర అమ్మవార్లకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని స్థానిక నాయకులతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. బిజెపి నియోజకవర్గ ఇంచార్జి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆయా గ్రామాల్లోని గుడులను సందర్శించి పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంబడి చామకూర భద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సామల సందీప్‌రెడ్డి, బి. జగన్‌రెడ్డి, పన్నాల కొండల్ రెడ్డి, బండారి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాన్ని అందజేస్తున్న స్వామిదాసు

## యమ్మార్పీఎస్ గ్రామ కమిటీ కార్యవర్గం ఎన్నిక

**పెద్దేముల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం నాగులపల్లి యంఆర్‌పిఎస్ గ్రామ కమిటి అధ్యక్షులుగా హరిజన్ మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యంఆర్‌పిఎస్ మండల ఇంచార్జ్ స్వామిదాసు అధ్వర్యంలో శుక్రవారం నాగులపల్లి గ్రామ కమిటిని ఎన్నుకున్నారు. యంఆర్‌పిఎస్ అధ్యక్షులుగా హరిజన్ మల్లేశం, అధికార ప్రతినిధిగా హరిజన్ సంపత్, ప్రధాన కార్యదర్శులుగా భానుప్రసాద్, హరిజన్ చరణ్, ఉపాధ్యాక్షులుగా శ్రీశాంత్, వరప్రసాద్, అఖిల్, కోశాధికారిగా సంజీవ్, కార్యవర్గసభ్యులుగా అరవింద్, డేవిడ్, మహేష్, నవీన్, తుల్జారాం, శేఖర్, నరేష్, ప్రశాంత్, ప్రదీప్, మండల సభ్యులుగా హరిజన్ రవిందర్, హరిజన్ భానుప్రసాద్‌లను ఎన్నుకున్నారు.



విద్యార్థులకు సైకిళ్లు బహూకరిస్తున్న దాతలు

## విద్యాభివృద్ధికి తోడ్పడడం అభినందనీయం

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 16,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతి కోసం తోడ్పాటునందించడం ఎంతో అభినందనీయమని జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ సర్పంచ్ మహాబూబీ అన్నారు. పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు, దివంగత ఉదయ్ కుమార్, కుమారుడు విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారంగా ఐదు సైకిళ్లను అందజేశారు. వీటిలో తూంపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినులు కుమారి లావణ్య, కుమారి మనసలకు ఒక్కొక్క సైకిల్, గుర్రంపల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థిని కుమారి భార్గవికి ఒక సైకిల్ అందించారు. మిగిలిన సైకిళ్లను అవసరమైన విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల టాపర్‌గా నిలిచిన మాస్టర్ భాను ప్రతాప్‌కు ఉప సర్పంచ్ షేకర్ రూ. 5వేల నగదు బహుమతిని అందజేశారు. రెండో టాపర్ కుమారి నుస్రత్‌కు రూ.3వేల నగదు బహుమతిని అందించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మహేష్ పాఠశాల అభివృద్ధికి ఒక కంప్యూటర్‌ను అందజేయడంతో పాటు, భవిష్యత్తులో మరికొన్ని పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, దాతలు విద్యార్థుల విద్యాభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమమంలో అక్రమ్, మంజుల, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల గోదాంకు ప్రారంభోత్సవం

**తలకొండపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న రైతుల గోదామును తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన బస్సు మనోహర్ స్వచ్ఛందంగా గోదాం ఏర్పాటు చేసుకొని ఆదివారం మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభింప చేశారు. దంపతులకు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ కటికల నిర్మల శ్రీశైలం యాదవ్, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచులు నిర్మల లలిత జ్యోతయ, నాయకులు కోటేశ్వర్, ఆంజనేయులు, ఎన్నో మోహన్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నయన మనోహారం-రంగనాథ కల్యాణం

**ఘట్‌కేసర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో ఆదివారం శ్రీగోదామన్నారు రంగనాయకస్వామి కళ్యాణోత్సవం కనుల పండువలా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో గోదా, రంగనాయకస్వామి ఉత్సవ మూర్తులకు వేదపండితుల మంత్రోచ్చారణాలలు, భక్తుల గోవిందనామ స్మరణల మధ్య కళ్యాణం జరిపించారు. మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ లక్ష్మి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌కుమార్, సీఎంఆర్ హెల్త్‌సిటి చైర్మన్ చామకూర భద్రారెడ్డి, ప్రీతిరెడ్డి దంపతులు, ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డిలు విచ్చేసి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించుకున్నారు. స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ ధర్మకర్తలు వారికి స్వాగతం పలికారు.



గోదాదేవి, రంగమన్నార్‌నాయకస్వామి కల్యాణోత్సం నిర్వహిస్తున్న ధర్మకర్తలు

ఈసందర్భంగా కళ్యాణాన్ని తిలకించిన అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేసి అన్నప్రసాదం అందించారు. సాయంత్రం గరుడసేవలో ఉత్సవ మర్తులను ఊరేగించారు. సోమవారం శ్రావణ గరుడ పంచమి సందర్భంగా సాయంత్రం స్వామి విమాన రథోత్సవం నిర్వహిస్తామని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు విచ్చేస్తున్నారని ధర్మకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరువడందం పొరెత్తి వంశపారంపర్య ధర్మకర్తలు లక్ష్మణాచార్యులు, శేషాచార్యులు, పార్థసారథి, వెంకటాచార్యులు, వేణుగోపాలాచార్యులు, రఘునాధాచార్యులు, పురుషోత్తమాచార్యులు, అనంతశేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, భారత వాలీబాల్ జట్టు కోచ్ రవికాంత్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, న్యాయవాది శ్రీనాథరావు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, కర్రె రాజేశ్, నక్క సందీప్‌గౌడ్, బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు, సహకార సంఘం డైరక్టర్లు చందుపట్ల ధర్మారెడ్డి, కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బండారి అంజనేయులు, కడపొల్ల మల్లేశ్, సొసైటీ మాజీ డైరక్టర్ గాయరు విశ్వనాథం, మాజీ ఎంపిటిసిలు మంకం రవి, కప్పరగళ్ల కరుణాకర్, పులకంటి భాస్కర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి, నాయకులు కాలేరు రామోజీ, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మెట్టు నర్సింహ్మా, సోమసాని రమేశ్, బట్టె లక్ష్మణ్‌రావు, రాచకట్ల శ్రీశైలం, ఉల్లి అంజనేయులు, పైళ్ల లతరెడ్డి, పోలు భాస్కర్‌గౌడ్, ఎర్రోళ్ల మురళీకృష్ణ, కంచర్ల వెంకట్‌రెడ్డి, కవాడి మాధవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, బింగి యుగంధర్‌గౌడ్, మంచాల సుధాకర్, పసులాది నర్సింగ్‌రావు, సురేశ్‌నాయక్, బొక్క సంజీవరెడ్డి, పొత్కని మల్లిఖర్జున్‌రాజు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వేముల రాజుగౌడ్, సామల నవీన్, కుక్కునూరు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

# కూతురితో బోనాల పండుగకు వెళ్తూ..

★లారీ ఢీకొని డిగ్రీ విద్యార్థిని అక్కడికక్కడే మృతి ★శోకసంద్రంలో మునిగిన కుటుంబం
★తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు.. ★అనంతలోకాలకు ఏకైక కుమార్తె! ★కాలకూట విషమైన అతివేగం
★వారాసిగూడ నుంచి రాయపర్తి వెళుతుండగా ఘోరం ★ఘట్‌కేసర్‌లో విషాదఛాయలు

**ఘట్‌కేసర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ముందు వెళ్తున్న బైక్‌ను లారీ ఢీకొట్టగా ఓయువతీ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా ఆమె తల్లిదండ్రులకు తీవ్ర గాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ బైపాస్ రహదారి వందన హోటల్ సమీపంలో జరిగిన ఈప్రమాదంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న గుబా శ్రావణి (17) అక్కడిక్కడే దుర్మరణం చెందగా ఆమె తల్లిదండ్రులకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగ్రాత్రులను అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు.
వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన గుబా సురేశ్ (38), అతని భార్య ఉమారాణి (33), కూతురు శ్రావణి (17)లు సికింద్రాబాద్ వారాసిగూడలో ఉంటు న్నారు. ఆది వారం వారి స్వగ్రామం రాయపర్తిలో బోనాల పండుగ ఉండటంతో శనివారం ఉదయం ద్విచక్రవాహనం (టిజి10ఎఫ్-2209)పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ (టిజి07యు-2133) అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కింద పడగా వెనక కూర్చున శ్రావణి (17)పై లారీ వెనకచక్రం వెళ్లడంతో తల చిద్రమై అక్కడిక్కడే మృతి చెందింది. తండ్రి సురేశ్, తల్లి ఉమారాణిలకు తీవ్ర గాయాలు కావ డంతో వారిని ఆసుపత్రికి తరలించారు. బిఎన్.రెడ్డినగర్‌కు చెందిన లారీ డ్రైవర్ తిరుపతి అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.
శ్రావణి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, ఆమె తల్లిదండ్రులకు ఆసుపత్రిలో చికిత్సచేయిస్తున్నారు. మృతురాలు శ్రావణి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని, ప్రజలు వాహనాలను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపకుండా, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.

## విద్యార్థికి వాతలు పెడుతుంటే మీరేం చేస్తున్నారు?

### గరుకుల పాఠశాలలో ర్యాగింగ్‌పై కెవిపిఎస్ ఆగ్రహం

### ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**పెద్దేముల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం ఎన్‌టిఆర్ నగర్ కాలనీలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ (బాలుర) గురుకుల పాఠశాల (పెద్దెముల్) ప్రిన్సిపాల్, యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేవిపిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పలి మల్కయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో జరిగిన ఘటన నేపథ్యంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి తోటి విద్యార్థులు చపాతీలు కాల్చే కర్రతో వాతలు పెట్టారని, అంతేగాకుండా పాఠశాలలో తోటి విద్యార్థులు అనేకసార్లు ఇబ్బందులకు గురిచేసిన పాఠశాల ప్రిన్సిపాల్ గాని, ఉపాధ్యాయులు గాని ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తు గొప్యంగా ఉంచుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.
అంతేగాకుండా సీనియర్లు జూనియర్లకు ర్యాగింగ్ చేయడం, రాత్రి సమయంలో విద్యార్థులు బయటకు తిరిగి రావడం ఏమిటని ప్రశ్నించారు.
ఇప్పటికైన జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి పాఠశాలను తనిఖీ చేసి పూర్తి సమగ్ర విచారణ జరిపి భాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో కేవిపిఎస్ ప్రజాసంఘాల అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు.

### కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై

## నేటి నుంచి ప్రజాచైతన్య యాత్ర



గోడపత్రికను విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 16,ప్రభాతవార్త:** జిల్లేడు చౌదరిగుడా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజా చైతన్య యాత్రకు గోడపత్రికను సిపిఐ మండల కార్యదర్శి జిల్లెల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్ధుల జంగయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఏ ఒక్కరి ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకులు బిఎస్ఎన్ఎల్ రైల్వే ఓడరేవులు అన్నిటిని కూడా ప్రైవేట్ పరం చేస్తూ ఆదాని అంబానీలకు కట్టబెడుతున్నారని అన్నారు. వెంటనే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు నిత్యవసర వస్తువుల ధరలు అన్నిటిని కూడా తగ్గించాలని అన్నారు. ఈ నెల 17వ తేది నుంచి 21వ తేది వరకు రంగారెడ్డి జిల్లాలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కొన్నారు. ప్రజా చైతన్య యాత్ర 19వ తేదీన జిల్లేడ్ చౌదరిగుడా కొందుర్గు మండలంలో పర్యటిస్తుందని ఈ చైతన్య యాత్రకు కార్మికులు కర్షకులు ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎండి షబ్బీర్, మండల నాయకులు చోటు, అన్వర్, పాపయ్య, రామయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల గణేష్ ఇంట్లో పెళ్లి బాజాలు

### తరలివచ్చిన సినీ,రాజకీయ ప్రముఖులు

**షాద్‌నగర్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ బండ్ల గణేష్ ఇంట్లో పెళ్లి బాజాలు మోగాయి. బండ్ల గణేష్ కూతురు జనని వివాహం సూర్యతేజతో ఈరోజు హైదరాబాద్ జేఆర్సి కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా జరుగుతుంది. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పెళ్లి అత్యంత వైభవంగా జరుగుతుండగా పెళ్లి దంపతులు సంప్రదాయ దుస్తుల్లో తళుక్కుమన్నారు. ఈ వేడుకలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు, తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, నాగచైతన్య, మంచు విష్ణు, షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.







మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

## బహుజన యోధుడి చరిత్ర చాటాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** దళిత బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని మొట్టమొదటగా నిరూపించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని మంగళవారం నిర్వహించాలని ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ సంస్థ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలు తీసుకెళ్లడానికి ఆదివారం ఘట్‌కేసర్‌లో 279వవారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయ్‌ఆర్ట్స్ మంచాల విజయ్‌కుమార్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ సర్ధార్ సర్వాయి సర్దార్ పాపన్న మహారాజ్ 350 సంవత్సరాలు ముందే బహుజన రాజ్యాధికారాన్ని నెలకొల్పటం జరిగిందని, ఈనెల 18వ తేదీన సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ 377వ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శివకృష్ణ మాట్లాడుతూ ఆ బహుజన యోధుడి చరిత్ర భావితరాలకు చాటాలన్నారు. దేశం అభివృద్ధి చెందడం అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు, ప్రతి పౌరుని నైతికాభివృధి దేశాభివృద్ధి అని అంబేద్కర్ మాటలను సూక్తిగా లలిత్ చెప్పారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాస్, ఉపాధ్యక్షులు కడుపోళ్ల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి ఇరిటం శ్రీనివాస్, నాయకులు రాందాసు, కె.సత్యం, కె నర్సింగ్ రావు, ఇ.విష్ణు, డి.శివకృష్ణ, సందేశ్, జి. లక్ష్మణ్, ఎం.దేవాన్ష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

### పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా

## ఇందిరమ్మ ఇళ్లు

**షాద్‌నగర్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన విజయలక్ష్మి ౖ దంపతులు ప్రభుత్వం మం జూరు చేసిన ఇందిరమ్మ నూతన గృహంలో గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించి విజయలక్ష్మి ౖ దంప తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చెంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాలు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని, సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అభినందనలు తెలుపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొని విజయలక్ష్మి ౖ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ముబారక్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్ రవికుమార్

## 18 నెలలుగా రేషన్ డీలర్ లేడు

**పెద్దేముల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు మాజీ సర్పంచ్ అవుసలి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు మాజీ సర్పంచ్ రవికుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గాజీపూర్ గ్రామంలోని అంగన్‌వాడి సెంటర్‌లో గత రెండు సంవత్సరాల నుంచి ఆయా లేదని, 18 నెలల నుంచి రేషన్ డీలర్ కూడా లేదని, అందుకు ఈ రెండు పోస్టులు భర్తి చేయాలని అన్నారు. మహిళా సమాఖ్య భవన నిర్మాణము స్థల సమస్య వల్ల నిలిచిందని, అందుకు అట్టి స్థలమును సర్వేచేయించి నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసి 15 నెలలు కావస్తున ఇంతవరకు కల్యాణలక్ష్మి రాలేదని, సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

**పూడూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త :** ఈనెల 17న పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపిడిఓ పాండు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజల నుండి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వివరించారు. ఇట్టి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అద్వర్యంలో తగు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతం

**దుద్యాల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో ఆరోగ్య వర్ధిని ఆయుర్వేదిక్ వైద్యశాల, అమీర్‌పేట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుచితారెడ్డి నేతృత్వంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి కీళ్ల నొప్పులు, నరాల నొప్పులు, కంటి సమస్యలు, వివిధ రకాల అలర్జీలకు చికిత్స, వైద్య సలహాలు అందించారు. సుమారు 80 మంది గ్రామస్తులు వైద్య సేవలు పొందారు. గ్రామీణ పేదలకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సుచితారెడ్డి తెలిపారు. ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆహార, జీవనశైలి నియమాలపై సూచనలు ఇచ్చారు. సర్పంచ్ వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ జగదీశ్ శిబిరాన్ని అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నేడు ఉచిత కంటి వైద్య శిబిరం..**

దుద్యాల్ గ్రామ సర్పంచ్ సంగీత వాణి ఆధ్వర్యంలో గ్రామ ప్రజల కోసం ఆగస్టు 17న మండల పరిషత్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శంకర కంటి ఆసుపత్రి, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి శిబిరం కొనసాగుతుంది. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందించనున్నారు. కంటి శుక్లాలు ఉన్నవారిని గుర్తించి ఉచిత శస్త్రచికిత్సకు ఎంపిక చేయడంతో పాటు ఇతర కంటి సమస్యలకు వైద్యుల సలహాలు అందిస్తారు. దుద్యాల్ గ్రామంతో పాటు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ సంగీత వాణి కోరారు.

## టెన్త్ టాపర్లకు రూ.5 వేల స్కాలర్‌షిప్

**షాద్‌నగర్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఎస్ఎస్‌సీ టాపర్లను ప్రోత్సహించేందుకు మెమోరియల్ స్కాలర్‌షిప్ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.5,000 చొప్పున స్కాలర్‌షిప్‌ను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. షాద్‌నగర్‌లోని మా కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల ఎస్ఎస్‌సీ టాపర్లను తీసుకురావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ చైర్మన్ వి. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం, వారి విద్యాభ్యాసానికి తోడ్పాటు అందించడమే ఈ స్కాలర్‌షిప్ కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## పాపన్న జయంతిని విజయవంతం చేయాలి

**వికారాబాద్,ప్రభాతవార్త :** జిల్లాలో ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గం మల్లికార్జున గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బిజేఆర్ చౌరస్తాలో ఉదయం 9 గంటలకు.. జిల్లా కలెక్టరేట్లో 10 గంటలకు జరిగే కార్యక్రమానికి గౌడ కులస్థులు భారీగా తరలిరావాలని తెలిపారు. ట్యాంక్ బండ్ పై విగ్రహ ప్రతిష్టాపన అదే రోజు సాయంత్రం 4 గంటలకు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ౖాష్ట అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ గౌడ్, నాగరాజ్ గౌడ్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**పూడూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త :** ఇంట్లోఫ్యానుకు ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన తలారి కృష్ణమోహన్ అనేవ్యక్తి శనివారం మధ్యాహ్నం సుమార 12గంటల ప్రాంతంలో తనతల్లి తలారి శాంతమ్మతో కలిసి ఇంట్లో మాట్లాడుతుండగా, తన పెద్దసోదరి భర్త కెరెల్లి మల్లేష్ ఇంటికి రావడంతో తల్లి పక్కింటి వారిని కలిసేందుకు వెళ్లింది. అదే సమయంలో బావకూడా బయటకు వెళ్లడంతో కృష్ణమోహన్ తన బెడ్‌రూంలో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి శాంతమ్మ తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు బిగించి ఉండడంతో అనుమానించి కేకలు వేయగా, చుట్టుపక్కలవారు వచ్చి చూసేసరికి కృష్ణమోహన్ విగతజీవిగా ఉన్నాడు. మృతుడి బెడ్‌రూంలో ఉన్న పుస్తకంలో సూసైడ్‌నోట్ లభించినట్లు, రూ.15 లక్షలు అప్పుచేసి గ్రామ సర్పంచ్ దయారకర్ వద్ద భూమిని కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ చేయకపోగా, మిగతా డబ్బులకోసం వత్తిడి చేసినట్లు దీంతో మనస్తాపంచెంది ఉరివేసుకున్నట్లు, అందులో రాసి ఉన్నట్లు తల్లిశాంతమ్మ చేసిన పిర్యాదులో ఆరోపించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కేసునమోదు చేసుకున్న చెన్‌గోముల్ పోలీసులు భూమి లావాదేవీలతో పాటు కృష్ణమోహన్ మృతికిగల కారణాలపై విచారణ చేపట్టి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



## మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తమ సేవా పురస్కారం

**శామీర్‌పేట, ఆగస్టు 16, ప్రభాతవార్త:** అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వాహణల ప్రతిభను చాటి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని (అవార్డును) అందుకున్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, జిల్లా అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి, డిసిపి సురేశ్‌కుమార్,ల చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. జిల్లా స్థాయిలో అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి ప్రశంసపత్రాన్ని అందుకోవటంతో పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలియజేశారు.

## తాళం వేసిన ఇళ్లే టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

మాస్కులు, చేతులకు గ్లోవ్ లు వేసుకొని, ఒకరు లేదా ఇద్దరు కాపలాగా ఉండగా, మిగిలిన వారు ఇనుప రాడ్లు తదితర సామగ్రితో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలు, నగదు మరియు ఇతర విలువైన వస్తువులను అపహరించేవారు. చోరీలకు వెళ్లే సమయంలో తాళాలు పగులగొట్టేందుకు అవసరమైన సామగ్రితో పాటు, ఎవరైనా తమను అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడి చేయడానికి కొడవలి వంటి ఆయుధాలను కూడా వెంట తీసుకెళ్లేవారని దర్యాప్తులో వెల్లడైంది. చోరీ చేసిన అనంతరం అపహరించిన సొత్తును గ్యాంగ్‌లోని శివమణి మరియు వీరి గ్యాంగ్ లోని మహిళల ద్వారా డిస్పోజ్ చేస్తున్నారు. పోలీసుల విచారణలో నిందితులు గత ఆరు నెలల కాలంలో శంకర్‌పల్లి, బీడీఎల్ భానూర్, గజ్వేల్ మరియు పరిసర ప్రాంతాల్లో మొత్తం 11 చోరీ నేరాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులకు సంబంధించి నిందితుల నుంచి చోరీ సొత్తు, నేరానికి ఉపయోగించిన సామగ్రి మరియు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## 7.5 క్వింటాళ్ల కల్తీ బెల్లం స్వాధీనం

**బంట్వారం, ప్రభాతవార్త :** కల్తీ గాడిని ఖాకీలు ఎట్టకేలకు పట్టుకున్నారు. కుళ్ళిపోయిన కల్తీ బెల్లాన్ని మాయమాటలు చెప్పి వినియోగదారులకు ఓ కేటుగాడు విక్రయించి వ్యాపారం చేస్తున్నాడు. మోసపోయిన కొందరు వినియోగదారులు టాస్కోఫ్ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించి కల్తీ బెల్లం విక్రయించి సొమ్ము చేసుకుంటున్న కల్తీ గాడిని పట్టుకున్నారు. ఈ సంఘటన బంట్వారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో నిబంధనల ఉల్లంఘనలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె అన్వార్ పాషా ఆధ్వర్యంలో బంట్వారం మండలం బోపనారం గ్రామ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆటోలో తాండూర్‌కు తరలిస్తున్న సుమారు 4 క్వింటాళ్ల కల్తీ, కుళ్లిపోయిన బెల్లాన్ని పోలీసుల కంటపడింది. ఆటోలో ఉన్న కల్తీ బెల్లం వ్యాపారి చంద్ పాషా, అతని డ్రైవర్ మొహమ్మద్ కుతుబొద్దీన్లను అదుపులోకి తీసుకుని విచారించారు. పట్టుబడిన కల్తీ బెల్లంతో పాటు మరికొన్ని క్వింటాళ్ళ బెల్లం గోధాంలో నిల్వ ఉన్నట్లు నింధితులు తెలిపారు. పోలీసుల విచారణలో వెల్లడించారు. దీంతో ఆటోలోని బెల్లంతో పాటు దుకాణంలో గోధాంలో నిల్వ ఉన్న మొత్తం 7,5 క్వింటాళ్ళ కలీ బెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బెల్లాన్ని బంట్వారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# కోట్ల విజయభాస్కర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**షాద్‌నగర్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మాజీ ముఖ్యమంత్రి, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతి సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి దేశానికి, రాష్ట్రానికి అందించిన సేవలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి కోట్ల విజయభాస్కర్ రెడ్డి అందించిన సేవలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పట్ల నిబద్ధతతో పనిచేసిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాజకీయ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రజాసేవను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని వీర్లపల్లి శంకర్ అన్నారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సంక్షేమం కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మండల సింగిల్ విండో వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్ ముదిరాజ్, అప్పారెడ్డి గూడ మాజీ ఉపసర్పంచ్ సీతారాం, నాని తదితరులు పాల్గొన్నారు.



కోట్ల విజయభాస్కర్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్



ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఎస్ఐ రేఖ, ఏఎంఆర్ఐ గోవర్ధన్

## ఎక్సైజ్ ఎస్ఐ రేఖ, ఎంఆర్ఐ గోవర్ధన్ గౌడ్‌లకు ఉత్తమ సేవా పురస్కారం

**మోమిన్‌పేట్. ఆగస్టు 16. ప్రభాతవార్త:** 80వ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మోమిన్‌పేట్ (ఎక్సైజ్) ఆబ్కారి శాఖ ఎస్ఐ ఏ. రేఖ కు ఉత్తమ అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, వికారాబాద్ జిల్లా పాలనాధికారి దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మోహ్రా, జిల్లా స్థాయి అధికారుల చేతుల మీదుగా ఆమె ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సహదేవుడు మాట్లాడుతూ ఉత్తమ అవార్డు రావడం పట్ల ఎస్ఐ రేఖకు అభినందనలు తెలిపారు. ఉత్తమ అవార్డు అందుకున్న ఎక్సైజ్ ఎస్ఐ రేఖ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజా సమస్యల పైన నా ఉద్యోగ రిత్యా ప్రజల్లోకి వెళ్లి మంచి చెడులపై తగు సూచనలు సలహాలు ఇస్తూ ప్రజలు చెడు మార్గంలో వెళ్లకుండా అవగాహన కల్పించి సమస్యలు పరిష్కారం చేశాను అన్నారు. తను చేసిన కృషిని గుర్తించి ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా మండల రెవెన్యూ అసిస్టెంట్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోవర్ధన్ గౌడ్ విధి నిర్వహణలో భాగంగా తమ కృషికి గాను ఉత్తమ అవార్డు లభించింది. నేటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మోమిన్ పేట్ మండలానికి ఇద్దరికి అవార్డులు దక్కడం చాలా గౌర్వకాణం అని జిల్లా స్థాయి అధికారులు వారిని అభినందించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ అవార్డులు రావడంతో వివిధ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు ప్రజలకు సమస్య పరిష్కరించి అవగాహన కల్పించినందుకే తమకు అవార్డు రావడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగి ఎక్కడ విధులు నిర్వహించిన అంకితభావంతో పనిచేసి ప్రజల మెప్పు పొందడమే తమ ముఖ్య ఉద్దేశం అని అవార్డు గ్రహీతలు రేఖ, గోవర్ధన్ గౌడ్ లు చెబుతు ఆనందం వ్యక్తం చేశారు.



## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

**శామీర్‌పేట, ఆగస్టు 16, ప్రభాతవార్త :** రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనటానికి మేడ్చల్ జిల్లా జట్లను ఎంపిక కోసం హకీంపేట్‌లోని తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీలను జిల్లాకు చెందిన బాల, బాలికలకు నిర్వహించి జిల్లా జట్ల ఎంపిక కోసం పోటీలు నిర్వహించినట్లు మేడ్చల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ తెలిపారు. ఆదివారం శామీర్‌పేట మండలంలోని హకీంపేట్‌లో ఉన్న తెలంగాణ క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీలు బాల, బాలికలకు అండర్-14,16,18,20 పోటీలు నిర్వహించటం జరిగింది. ఈ నెల 26,27తేదీలలో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మేడ్చల్ జిల్లా జట్లను ఎంపిక చేయటానికి ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలకు మేడ్చల్ జిల్లా నుంచి సుమారు 350మంది వరకు విద్యార్థులు (అథ్లెటిక్స్) పాల్గొనటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో అథ్లెటిక్స్‌కు మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసం కోసం ఈ అథ్లెటిక్స్ పోటీలు దోహదపడుతాయన్నారు. అథ్లెటిక్స్‌లో మున్ముందు కూడ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించటానికి జిల్లాకు గుర్తింపు తీసుకరావటానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 26,27తేదీలలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మంచి ఫలితాలు తీసుకరావాలని ఆయన సూచించారు. నిరంతర సాధనతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మంచి అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు రాజు, అశోక్, తిరుమలరావు, పిఇటిలు శేఖర్, సునీల్, గోపాల్, భద్రం, శ్రావణి, సత్యనారాయణ, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మల కత్తిరింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. 11 కెవి యంనంపేట్ ఫీడర్ పరిధిలోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని కాలనీలు, పడమటిసాయిగూడ, వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు, 11 కెవి ఎన్ఎఫ్‌సీనగర్ ఫీడర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, రైతులు గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తమకు సహకరించాలని ఏఈ సూచించారు.



ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశంలో పాల్గొన్న నాయకులు

## ఇందిరమ్మ ఇంటితో భవితకు భరోసా

**షాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** మండలం పోతుగల్ గ్రామంలో కేతావత్ నరేష్ ఇందిరమ్మ నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడుపల్లి పెంటారెడ్డి, పోతుగల్ సర్పంచ్ పామెన నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు అంటే కేవలం ఇల్లు కాదని, పేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తుపై భరోసా అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మంజూరైన నూతన గృహంలోకి నరేష్ కుటుంబం ఆనందంగా అడుగుపెట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పోతుగల్ సర్పంచ్ పామెన నరసింహులు, మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, పోతుగల్ ఉప సర్పంచ్ రాజు గౌడ్, దామర్లపల్లి ఉపసర్పంచ్ దయాకర్ చారి, సంజీవ్, యువ నాయకులు రవీందర్ రెడ్డి, మహేందర్, యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ హరికృష్ణ రెడ్డి, ఆకాష్, గ్రామ సీనియర్ నాయకులు యాదయ్య, శ్రీనివాస్ ముదిరాజ్, ఇతర గ్రామ నాయకులు, యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పాల్గొన్న మేడ్చల్ ఎఎంసి చైర్మన్ నర్సింలుయాదవ్ తదితరులు

**శామీర్‌పేటలో..**

**శామీర్‌పేట, ఆగస్టు 16, ప్రభాతవార్త :** కేశవరంలో ఇందిరమ్మ ఇళ్లను మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ ప్రారంభించారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని కేశవరం (20వ వార్డు)లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కావటంతో ఆయన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్దిదారులతో (పులి మహేశ్ దంపతులతో) గృహప్రవేశంను చేయించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయటం, సకాలంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకున్న లబ్దిదారులను ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేరుస్తుందని ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి మంజూరు చేస్తుందని మేడ్చల్ ఎఎంపి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ పేర్కొన్నారు. దీనిలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, 20వ వార్డు కౌన్సిలర్ బి.మల్లేశ్‌యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రామస్వామి, మున్సిపల్ మైనార్టీ అధ్యక్షులు ఎండి యూసుఫ్, మాజీ వార్డు సభ్యులు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## గోదారంగనాథుడికి నేడు రథోత్సవం

**ఘట్‌కేసర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నారు రంగనాయకస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం విమాన రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి కళ్యాణం నిర్వహించగా సోమవారం రథోత్సవం జరుగనుంది.

రథాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్‌దీపాలతో అలంకరించి ఉత్సవ మూర్తులను భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఘనంగా ఊరేగిస్తారు. శ్రీగోదా మన్నారు రంగనాయక స్వామి ఆలయాన్ని సుమారు 600 సంవత్సరాల క్రితం ఎదులాబాద్‌లో అప్పలాచార్య అప్పన్న అయ్యంగార్ నిర్మించారు. ఎంతో ఘన చరిత్ర కల్గిన ఆలయం దేవాదాయశాఖ ఆధీనంలో లేకపోవడంతో తిరువడందం పొరెత్తి వంశపారంపర్య ధర్మకర్తలు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మొఘలులు భారతదేశంపై దండెత్తక ముందే ఇది నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఇక్కడి ప్రధాన దైవం శ్రీగోధారంగనాయక స్వామి అయినప్పటికీ, వాస్తవానికి గోధాదేవి అలియాస్ కోదై అమ్మవారికే ఇక్కడ ఎక్కువ ప్రాధాన్యత ఉంది. భారతదేశం మొత్తం మీద ఆండాళ్ అమ్మవారికి కేవలం రెండు ఆలయాలు మాత్రమే ఉండగా వాటిలో ఒకటి తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు కాగా ఈఆలయం రెండవది, అందుకే దీనిని ఉత్తర శ్రీవిల్లిపుత్తూరు అని పిలుస్తారు. 15వ, 16వ శతాబ్దాల మొఘల్ కాలంలో ఎదులాబాద్‌ను రాయపురం అని పిలిచేవారు. ఈఆలయానికి సమీపంలోనే 400 ఎకరాల విస్తీర్ణం కల్గిన లక్ష్మీనారాయణ చెరువు ఉంది. ఈఆలయం చారిత్రాత్మకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన, భారతదేశంలోనే అత్యంత అరుదైన దేవాలయాలలో ఒకటి. రాష్ట్రంలోనూ దేశవ్యాప్తంగానూ అనేక దేవాలయాలు ఉన్నప్పటికీ వాటిలో ముఖ్యమైనవి మూడు మాత్రమే. అందులో ఒకటి తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూర్, మిగిలిన రెండు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. ఇక్కడికి వచ్చి గోదాదేవి అమ్మవారికి పూజలు, గాజులు సమర్పించే అవివాహిత యువతులకు వివాహం జరుగుతుందని ప్రగాఢ నమ్మకం. శ్రీవిల్లిపుత్తూరులో శ్రీగోధాదేవిని కోదై అని, ఇక్కడ గాజులమ్మగా కూడా పిలుస్తారు.





## విద్యార్థుల ప్రతిభకు సిఎస్ఆర్ ఫౌండేషన్ ప్రోత్సాహం

**నందిగామ, ఆగస్టు 16, ప్రభాతవార్త :** కష్టపడి చదివి ఎదిగినప్పుడే అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు, సమాజంలో మంచి గౌరవం దక్కుతుందని సి ఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చింతలపల్లి శేఖర్ రెడ్డి అన్నారు. పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా నందిగామ మండలం మేకగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6 నుండి 10 వ తరగతి విద్యార్థులకు నగదు బహుమతిగా రూ.17500 అందజేశారు. ప్రథమ శ్రేణి విద్యార్థులకు రూ.2000 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.1500 ప్రతి సంవత్సరం అందజేస్తామని మాటిచ్చారు. రైతు బిడ్డగా, గురువుగా, సమాజ వికాసంలో తన వంతు పాత్ర పోషిస్తూ సేవలందిస్తున్న చింతలపల్లి శేఖర్ రెడ్డి సేవలను కొనియాడుతున్నారు. విద్యార్థుల చదువులను ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం అందజేసిన సి ఎస్ ఆర్ ఫౌండేషన్ చింతలపల్లి శ్రీరామ్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సుభాష్ రెడ్డి లకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్ సేవామూర్తి శేఖర్ రెడ్డిని సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ వార్డు నెంబరు 8 అన్నోజిగూడ మహంకాళి, ఎర్ర పోచమ్మ, నల్ల పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం సందర్శించి పూజలు చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి ఎమ్మెల్యేకు శాలువా కప్పి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై అమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌తో పాటు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాద్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ రాధారపు యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు అబ్బవతి నర్సింహ, జితేందర్ నాయక్, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, ఉమశంకర్ రెడ్డి, రాధారపు శ్రీశైలం, అల్వాల సంతోశ్ గౌడ్, రాఘవేందర్ రెడ్డి, సంతోశ్ నాయక్, లోకేశ్ రెడ్డి, దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి అనితాలాలయ్య

## వైభవంగా విగ్రహ ప్రతిష్ట

**శామీర్‌పేట, ఆగస్టు 16, ప్రభాతవార్త :** ఉప్పరిపల్లి గ్రామంలో శ్రీబంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శామీర్‌పేట డివిజన్-300 పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో శ్రీబంగారు మైసమ్మ ఆలయం విగ్రహ ప్రతిష్టా పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శ్రీబంగారు మైసమ్మ అమ్మవారిని శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, ఉప్పరిపల్లి గ్రామ మాజీ సర్పంచు కె.రవీందర్, మాజీ కౌన్సిలర్ పి.పాండు, నాయకులు వెంకటేశ, బాలకృష్ణ, అశోక్ దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శామీర్‌పేట గ్రామ శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన పూజారి జి.మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు పూజారులు పాల్గొని అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. శ్రీబంగారు మైసమ్మ అమ్మవారిని పలువురు గ్రామ నాయకులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తరువాత అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా కన్నుల పండుగగా జరిగింది.

**లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో**

**శామీర్‌పేట, ఆగస్టు 16, ప్రభాతవార్త :** లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్‌లో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణం జరిగి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లాల్‌గడిమలక్‌పేట్ గ్రామ గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టల సందర్భంగా పూజలు చేసి దర్శించుకున్నారు. దీనిలో కౌన్సిలర్లు నేమూరి స్వప్నరాంప్రసాద్‌గౌడ్, బండారి మౌనిక, సామల జవ్వంత్‌రెడ్డి, ముద్దం సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మేడ్చల్ ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, నాయకులు బొమ్మక్ శ్రీనివాస్, చీర్యాల శ్రీనివాస్, కోడూరి దినేశ్, రాఘవరెడ్డి, ఆల నర్సింహ్మారెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు శంకర్‌గౌడ్, సభ్యులు రాజుగౌడ్, అర్జున్‌గౌడ్, నాగేశ్‌గౌడ్, యాదగిరిగౌడ్, మల్లిఖార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి కేబీఆర్ చుట్టూ వన్‌వే

**జూబ్లీహిల్స్, ఆగస్టు 16, ప్రభాతవార్త**

కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ కష్టాలు ఇక మరింత పెరగనున్నాయా..! లేక భవిష్యత్‌లో రద్దీకి శాశ్వత పరిష్కారం దిశగా మరో అడుగులు పడుతున్నాయా..! ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మ కంగా చేపడుతున్న హెచ్‌సిటీ ప్రాజెక్టు నిర్మాణ పనుల నేపథ్యంలో ఈ నెల 18(నేటి) నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానం అమల్లోకి రానుంది. మేము తిప్పుతాం... మీరు తిరగండి అన్నట్టుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ప్రత్యా మ్నాయ మార్గాల్లో మళ్లించనున్నారు. కొత్త రూట్ల పై అవగాహన లేకుండా దారి తప్పితే మాత్రం మళ్లీ మొదటి జంక్షన్ చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. దీంతో కేబీఆర్ పరిసరాల్లో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

### దారి తప్పితే.. మళ్లీ మొదటికే...

కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న కీలక జంక్షన్లలో నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సాధా రణ రాకపోకలకు మార్పులు చేశారు. ఒక మార్గంలో వెళ్లాల్సిన వాహనాలను మరో మార్గంలోకి మళ్లించనున్నారు. దీంతో గతంలో నేరుగా వెళ్లే ప్రయాణం ఇకపై చుట్టూతిరిగి వెళ్లాల్సి రావచ్చు. ప్రత్యేకించి జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్, రోడ్ నంబర్ 45, ఫిలింనగర్, మహా రాజా అగ్రసేన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ప్రాంతాల్లో రూట్ల మార్పులు ఉండటంతో తొలిరోజుల్లో వాహనదారులు గందరగోళానికి గురయ్యే అవకా శం ఉంది. ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు, అధికారులు సామాజిక మాధ్యమాల తోపాటు, ప్రత్యక్షంగా ప్రజలకు, వాహదారులకు అవగా హన కల్పించే ప్రయత్నం చేశారు.

### 24 నెలల పనులు.. తాత్కాలిక ఇబ్బందులు...

కేబీఆర్ కారిడార్‌లో రూ.1,090 కోట్లతో చేపడు తున్న హెచ్‌సిటీ ప్రాజెక్టులో 7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. మొత్తం 14 నిర్మాణాలను 24 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యం గా పెట్టుకున్నారు. పనులు పూర్తయితే కేబీఆర్ పరిసరాల్లో సిగ్నల్ రహిత ప్రయాణం సాధ్యమవు తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం గంటకు వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో సిగ్నళ్ల వద్ద నిలిచిపోయే ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే ఈ పనులను అను కున్న గడువులోగా పూర్తి చేయాలని మెఘా సంస్థతో సైతం పనుల్లో వేగాన్ని పెంచింది.

### వాహనదారులకు పరీక్షే...

వన్‌వే విధానం అమలులోకి రావడంతో తొలి రోజుల్లో కేబీఆర్ పరిసరాల్లో ట్రాఫిక్ పోలీసులు, వాహనదారులకు పరీక్ష తప్పదని భావిస్తున్నారు. కొత్త రూట్లపై అవగాహన ఏర్పడేవరకు ప్రయాణ సమయం పెరగవచ్చు. ముఖ్యంగా తొందరగా వెళ్లాలనే ప్రయత్నంలో తప్పు మార్గంలోకి వెళ్తే తిరిగి సరైన రూట్‌లోకి రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

### ట్రాఫిక్ పోలీసులకు సహకరించండి
**సజ్జనార్, కమిషనర్**

ట్రాఫిక్ పోలీసులు రెండు దశల్లో ట్రయల్ రన్స్ నిర్వహించిన అనంతరం వన్‌వే విధానాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. పరిస్థితులను బట్టి ట్రాఫిక్ మార్గాల్లో అవసరమైన మార్పులు చేస్తా మని వెల్లడించారు. భవిష్యత్తు కోసం తాత్కలిక ఇబ్బందులు తప్పవని అంటున్నారు. కేబీఆర్ చుట్టూ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపడమే హెచ్‌సిటీ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు. వాహనదారులు తికమక పడకుండా ఉండేందుకు ఇప్పటికే వాహనదారులు ప్రయాణించే మార్గం లో రూట్ మ్యాప్‌లను, ట్రాఫిక్ పోలీసులను, మెఘా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సిబ్బందిని వినియోగిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడం, ఇంధనం ఆదా కావడం, వాహనాల నిలుపుదల తగ్గడంతో కాలుష్యం తగ్గడం వంటి ప్రయోజనాలు కలగను న్నాయి. రేపటి సాఫీ ప్రయాణానికి ఇప్పుడు ఇబ్బందులు తప్పవనేది కొందరు అధికారులు చెబుతున్నారు. వాహనదారులు కొత్త ట్రాఫిక్ మార్గాలను గమనించి, ట్రాఫిక్ పోలీసుల సూచ నలు పాటించాలని నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ కోరుతున్నారు.



బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్యాదవ్

## ఘనంగా బోనాల ఉత్సవాలు

### పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త :** బోనాల ఉత్సవాల సందర్భంగా మాజీమంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్యాదవ్ ఆదివారం పలు ఆలయాలలో పూజలు నిర్వహించారు. శ్రావణమాస బోనాల సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్యాదవ్ పద్మారావునగర్ పార్క్ లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకనకదుర్గ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం తలసాని శ్రీనివాస్యాదవ్ను కమిటీ సభ్యులు సన్మా నించారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇన్చార్జి గుర్రం పవన్కుమార్గౌడ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్రెడ్డి, సభ్యులు లాయక్, చంద్రశేఖర్, హన్మంతు, చక్రధర్, బన్సీ లాల్ పేట నాయకులు బాలరాజ్ యాదవ్, ఏసూరి మహేష్, లక్ష్మీపతి, శైలేందర్, అరుణ్గౌడ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

**పద్మారావునగర్లో...**

పద్మారావునగర్లోని సాయిబాబా ఆలయంసమీపంలో హరిచారి, సాయిరాం చారి ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పూజలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరేణుక ఎల్లమ్మతల్లికి ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ ఇన్చార్జి గుర్రం పవన్కుమార్గౌడ్, బన్సీలాల్పేట డివిజన్ నాయకులు బాలరాజ్ యాదవ్, లక్ష్మీపతి, శైలేందర్, దేశ పాక శ్రీనివాస్, అబ్బాస్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా రైల్ కళారంగ్లో నిర్వహించిన బోనాల ఉత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. అనంతరం పొట్టి శ్రీరాములు నగర్లోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నిర్వహించిన బోనాల పూజలకు హాజరై నల్లపోచమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ప్రేమ్, లక్ష్మీపతి, శ్రీనివాస్, అబ్బాస్, నిర్వాహకులు సాయి, శాంతి కుమార్ ఉన్నారు.

**సనత్నగర్లో బోనాల పూజల్లో పాల్గొన్న తలసాని**

**సంజీవరెడ్డినగర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** శ్రావణమాస బోనాల సందర్భంగా సనత్నగర్లోని వాల్మీకి వ్యాయామశాలలో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్యాదవ్ హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సురేష్గౌడ్, ప్రవీణ్రెడ్డి, ఖలీల్, రాజేష్ ముదిరాజ్, వసీం, ఇబ్రహీం, వ్యాయామశాల నిర్వాహకులు రవి తదితరులు పాల్గొన్నారు.

**పటేల్నగర్లో...**

**జూబ్లీహిల్స్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిల్మ్నగర్-పటేల్నగర్లో శ్రీఈదమ్మ తల్లి ఆలయ బోనాల జాతర ఆదివారం ఘనంగా జరిగింది. జూబ్లీహిల్స్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

**ఫిల్మ్నగర్లో...**

**జూబ్లీహిల్స్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** ఫిల్మ్నగర్ డివిజన్ పరిధిలోని పటేల్నగర్, బాల్రెడ్డినగర్, అంబేడ్కర్నగర్, రోడ్నంబర్ 46 బస్తీల ప్రజలు ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిల్మ్నగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింహారావు పాల్గొని ఈదమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బస్తీ కమిటీ సభ్యులు తిరుపతి, రాము, విష్ణు, నారాయణ, శ్రీనివాస్, రమణ, అశోక్, వెంకట్ నర్సు, దయ్యాల దాసు తదితరులు పాల్గొన్నారు.

**రహేజా విస్తాలో...**

**నాచారం, ప్రభాతవార్త ఆగస్టు 16 :** నాచారం రహేజా విస్తా అపార్ట్మెంట్స్లో తొలిసారిగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అపార్ట్మెంట్వాసులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

**వెంకటేశ్వరకాలనీ డివిజన్లో...**

**జూబ్లీహిల్స్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** వెంకటేశ్వరకాలనీ డివిజన్లోని పలు ఆలయాల్లో నిర్వహించిన బోనాల వేడుకలకు కాంగ్రెస్ పార్టీ వెంకటేశ్వరకాలనీ డివిజన్ అధ్యక్షుడు రాములుచౌహాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డివిజన్లోని దేవరకొండ బస్తీలోని నల్ల పోచమ్మ దేవాలయంతోపాటు ఇబ్రహింనగనగర్లోని శ్రీబంగారు ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయననతోపాటు రవి, వీర స్వామి, రఘునాథ్, శ్రీనివాస్రెడ్డి, నాగరాజు, సంపత్ రెడ్డి, రాజురెడ్డి పాల్గొన్నారు.

**బాగ్లింగంపల్లి సుందరయ్య పార్కులో...**

**చిక్కడపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** ఆదివారం బాగ్లింగంపల్లి సుందరయ్య పార్కులో ఉన్న శ్రీతెల్ల ఉప్పలమ్మ ఆలయంలో ఆషాడమాస బోనాలు ఉత్సవాలు ఆలయం చైర్మన్ బబ్లు(వెంకటకృష్ణ) ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. అంతకుముందు పోతరాజుల వీరంగాలతో సుందరయ్య పార్కు హోరెత్తింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దామోదర్రెడ్డి, ఎంఎన్ రావు, రాజేంద్రప్రసాద్గౌడ్, బి.వెంకట్స్వామిగౌడ్, ఆర్ జయదేవ్, నాగరాజు, కళ్యాణ్నాయక్, అంబటి శ్రీనివాస్రెడ్డి, అరుణ్కుమార్, కృష్ణ, భగత్, రాజు, తమిళ్ రాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

**గాంధీ ఆసుపత్రిలో...**

**సికింద్రాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** గాంధీ ఆసుపత్రిలో ఆదివారం శ్రావణమాస బోనాల వేడుకలతో ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. జీడీఎక్స్ రవికుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే ఆసుపత్రి పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళా సిబ్బంది నెత్తిపై బోనాలను ధరించి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, గాంధీ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, గాంధీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ పద్మిని ప్రియదర్శిని, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పూజలుచేశారు. అలాగే ఆర్ఎంఓవన్ డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ మాదాల కిరణ్, చీఫ్ డైటీషియన్ రమేష్, మేనేజర్ వెంకట రమణతోపాటు జీడీఎక్స్ కంపెనీ ప్రతినిధులు జయశ్రీ, శివాజీ, విజయ లక్ష్మి, సుధీర్ విష్ణు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను గాంధీ ఆసుపత్రి వర్గాలు ఏటా ఇంతే ఉత్సాహంగా నిర్వహించడం అభినందనీయమని హాజరైన అధికారులు కొనియాడారు. వేడుకల అనంతరం భక్తులకు, ఆసుపత్రి సిబ్బందికి తీర్థ, అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.



బోనాల వేడుకల్లో పాల్గొన్న వైద్యులు

# తేలికపాటి ఫైబర్ గ్యాస్ సిలండర్లు వచ్చేశాయి

### 90 నిమిషాల్లోనే డెలివరీ

**జూబ్లీహిల్స్, ఆగస్టు 16, ప్రభాతవార్త :** దాదాపు పదిహేను కేజీల బరువుండే ఇనుప గ్యాస్ సిలండర్లతో ఇక ఇబ్బందులు పడాల్సిన పనిలేదు. ఇప్పుడు మార్కెట్లోకి తేలికపాటి ఫైబర్ గ్యాస్ సిలండర్లు అందుబాటులోకి వచ్చాయి. మహిళలు మోయగలిగే బరువున్న ఈ ఫైబర్ సిలండర్లను హెచ్పీ గ్యాస్ సంస్థ నవ్య పేరుతో ఇప్పుడు నగరంలో దాదాపు ఏడు హెచ్పీగ్యాస్ డీలర్ల ద్వార అందిస్తుంది. జూబ్లీహిల్స్లోని బీఎస్ ఎంటర్ప్రైజెస్, శ్రీనగర్కాలనీలోని సందీప్తి గ్యాస్ ఏజెన్సీలతతోపాటు మరో అయిదు ఏజెన్సీల్లో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్తగా కనెక్షన్ కోరుకునే వారు ఆధార్ మినహా మిగిలిన ఏ గుర్తింపు పత్రాన్ని తీసుకొని వస్తే వెంటనే కనెక్షన్ను అందిస్తున్నారు. దాదాపు ఆరు కిలోల ఖాళీ ఫైబర్ సిలండర్లో పది కిలోల గ్యాస్ను అందిస్తున్నారు. బుక్ చేసిన 90 నిమిషాల్లోనే ఈ సిలండర్ను డెలివరీ చేస్తున్నట్లు సందీప్తి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు నాయుడు తెలిపారు. ఫైబర్ సిలండర్ల వాడకం వల్ల గ్యాస్ ఎంత మిగిలి ఉందో సైతం తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

అంతేకాకుండా ఇవి తుప్పు పట్టవని, మహిళలు సైతం వీటిని మోసే వీలవుతుందన్నారు. ఈ సిలండర్ కోసం మాములు సిలండర్లాగా 12 రోజులు వేచి చూడాల్సిన పనిలేదన్నారు. అయితే గ్యాస్ ధర వాణిజ్య సిలండర్ ధరతో సమానంగా ఉంటుందని, ఒకసారి ఫైబర్ గ్యాస్ సిలండర్ ఇస్తే వెనక్కి తీసుకోవడం ఉండదని, ముందస్తు సిలండర్ చెల్లింపు తిరిగి ఇవ్వబడదని అన్నారు. ఇప్పటికే పాత కనెక్షన్ ఉన్నా, కొత్త కనెక్షన్ కావాలన్నా ఈ నవ్య ఫైబర్ సిలండర్లను తేలికగా పొందవచ్చుని అన్నారు. ఈ సిలండర్లను ఏ ప్రాంతానికి మారినా అక్కడున్న డీలర్ వద్ద మార్చుకోవచ్చున్నారు.




శ్రీనగర్కాలనీలో ఏర్పాటుచేసిన ఫైబర్ గ్యాస్ సిలండర్లు.



దయాకర్ను సత్కరిస్తున్న అంబేద్కర్ సంఘం సభ్యులు

## అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వెలమకంటి దయాకర్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అంబేద్కర్ సంఘాల ద్వారా ప్రజా పోరాటంతో పాటు సంక్షేమ ఫలాలను ప్రజలకు అందే విధంగా శాయశక్తులా పనిచేస్తామని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలమకండి దయాకర్ అన్నారు. మియాపూర్లోని ఎంఏ నగర్లో తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రా ష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర నేత లాలయ్య అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేసిన మేకల చేరాలు ఇటీవల మృతిచెందడంతో కమిటీ సంతాపం ప్రకటించింది. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటుచేయాలని, ప్రస్తుత కమిటీ మార్చాలని తీర్మానించారు. రెండు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించిన కమిటీ సభ్యులు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న వెలమకంటి దయాకర్ను నూతన రాష్ట్రకమిటీ అధక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న పారంది స్వామిని వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమించారు. గతంలో అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన పోతరాజు లాలయ్యను అదే విధంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా పనిచేసిన జన్ను నరసయ్యలను రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దయాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ సంఘాలను బలోపేతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెల జయశ్రీ, రాష్ట్ర కార్యదర్శి డప్పు నగేశ్, హైదరాబాద్ గ్రేటర్ అధ్యక్షులు ఎన్ వి దీపా,ఘనపురం రవీందర్,గోదారి భాగ్యలక్ష్మీ, సుధారాణి, సౌజన్య, వరప్రసాద్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు గొర్రె థామస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కొనసాగిన ఇస్కాన్ 50 వసంతాల ఉత్సవాలు

**బేగంబజార్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** అబిడ్స్లోని ఇస్కాన్ రాధ మధన మోహన మందిరం 50 వసంతాలు రెండవరోజు ఆదివారం అంగరంగ వైభవంగా ఎగ్జిబిషన్మైదానంలో వేసిన ప్రత్యేక శిబిరంలో కొనసాగాయి. 1976 సంవత్సరంలో ప్రారంభమైన ఇస్కాన్ మందిరం 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అబిడ్స్ ఇస్కాన్మందిరంలో పుష్పాభిషేకం నిర్వహించారు. సాయంత్రం గంటలకు ప్రారంభమైన రెండవ రోజు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టినప్రత్యేక ఫోటో ప్రదర్శన భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ప్రభుపాదకథ, ప్రముఖుల ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్సాహభరిత కీర్తనలు,మహాప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలనుంచే కాకుండా దేశ విదేశాల నుంచి హరరామ, హరకృష్ణ భక్తులను వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేయడం కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈకార్యక్రమంలో ఇస్కాన్ అబిడ్స్ రాధమోహన మందిరం అధ్యక్షులు వరదకృష్ణదాసు,ప్రధాన కార్యదర్శి శంభు వైష్ణవదాస్లు పాల్గొన్ని ప్రత్యేక సూచనలు,సలహాలు ఇవ్వడం కనిపించింది.



భక్తులను ఆకట్టుకున్న హిరణ్య నాటక ప్రదర్శన

## బహదూర్పురా-1 డిప్యూటీ ఐఓఎస్గా యాదగిరి

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 16, ప్రభాతవార్త:** పాఠశాల విద్యాశాఖ, హైదరాబాద్ జిల్లా బహదూర్పురా -1 డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డిప్యూటీ ఐఓఎస్)గా బహదూర్పురా-2 ఉందాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం కె.యాదగిరి నియమితులైయ్యారు. ఈమేరకు హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.సోమిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన డిప్యూటీ ఐఓఎస్ పి.వెంకట్రెడ్డి జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. ఖాళీ అయిన ఆయన స్థానంలో యాదగిరిని నియమిస్తూ సాధారణ విధులతోపాటు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు(ఎఫ్ఎసి) అప్పగించారు. గతంలో అమీర్పేట్, షేక్పేట్ మండలాల డిప్యూటీ ఐఓఎస్గా పనిచేశారు. పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నూతన డిప్యూటీ ఐఓఎస్ యాదగిరికి శుభాకాంక్షలు తెలిపారు.

## భూలక్ష్మి మందిరంలో అన్నదానం

**అఫ్జల్గంజ్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** ఆషాడమాసం బోనాల ముగింపు తర్వాత శ్రావణ మాసంలో ముస్లింజంగ్ పూల్ సమీపంలోని చారిత్రాత్మకమైన భూలక్ష్మి మందిరం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి ప్రతినిధులు వై.బాబుగురు,దుర్గేష్, మాజీ కార్పొరేటర్ మెట్టువైకుంఠం తదితరులు పాల్గొన్నారు.ఈనెల 23వ తేదిన బేగంబజార్ శృంగఋషి భవన్లో మహాప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటి ప్రతినిధి వై.బాబుగురు తెలిపారు.

## గాంధీనగర్ సంక్షేమ సంఘం సమావేశం

**చిక్కడపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** గాంధీనగర్లోని మ్యాన్హర్ అపార్ట్మెంట్ ఆవరణలో గాంధీనగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కాబోయే అధ్యక్షుడు కె . రాజు, మాజీ అధ్యక్షుడు శామ్యూల్ , అడ్వైజర్ గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గోపాల్, సభ్యులు కుమార్, రమేష్ యాదవ్, మహమూద్, శ్రీనివాస్ రెడ్డి మరియు కోశాధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు బాగుచేయాలని ప్రజలు శాంతియుత ధర్నా

**నార్సింగి, ఆగస్టు 16 ప్రభాతవార్త :** రోడ్డు బాగు చేయాలని బండ్లగూడ జాగీర్ పిబెల్సిటీ ప్రాంతానికి చెందిన ప్రజలు రోడ్డు పక్కన కూర్చొని శాంతియుత ధర్నా నిర్వహించారు. మోకాలిలోతు గోతులు పడిన రోడ్డుపై నిత్యం ద్విచక్ర వాహనదారులు, కార్లలో వెళ్లేవారు నరకయాతన పడుతున్నారని, నడుం పట్టేస్తుందని స్థానికులు పేర్కొన్నారు. వర్షం కురిసిన సమయంలో అడుగడుగునా మాకు ప్రత్యక్ష నరకం కనిపిస్తుంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా మా రోడ్డును బాగు చేయాలని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమిషనర్కు, రాజేంద్రనగర్ సర్కిల్ డిసిలకు పదులమార్లు వినతిపత్రం ఇచ్చినా ఎవ్వరూ స్పందించడం లేదని ధర్నాలో కూర్చున్న వారు ఆరోపించారు. ప్రతీ ఏటా పీబెల్ సిటీ నుంచి రూ.కోటిన్నర ఆస్తి పన్నులను మేము ప్రభుత్వంకు టంచన్గా చెల్లిస్తున్నామని, అయినా మేము వెళ్లే రోడ్డును బాగు చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడం బాధాకరమని వాపోయారు. పన్నులు చెల్లించినా, చెల్లించకపోయినా ప్రజలకు మౌళిక వసతులు కల్పించడం ప్రభుత్వం ప్రాథమిక బాధ్యత అని, ఈ బాధ్యతను రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు విస్మరించడం దారుణమని మండి పడ్డారు. అధికారులు మా రోడ్డు మరమ్మత్తు విషయంను విస్మరించడం వల్లనే మేము ఈ రోజు రోడ్డు పక్కన శాంతియుతంగా ఆందోళన నిర్వహించామని, మరో పక్షం రోజుల్లో పరిష్కరించకపోతే జాతీయ రహదారిపై కూర్చొని ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. మమ్మల్ని రోడ్డుపైకి తీసుకు వచ్చింది అధికారులేనని, ఆ తరువాత జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ధర్నాలో పాల్గొన్న మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, యువకులు అందరూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ నిర్లక్ష్య వైఖరిని వీడి, పీబెల్ సిటీకి వెళ్లే రోడ్డును ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




ధర్నా చేస్తున్న స్థానికుల

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

### తెలంగాణ ప్రభుత్వ బిసి సంక్షేమ సలహాదారు వి. హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త**

శంభుల ఫౌండేషన్ చైర్పర్సన్ శంభుల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బాగ్ అంబర్పేట్ డివిజన్లోని భరత్నగర్ కమ్యూనిటీ హాల్లో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆరోగ్య శిబిరాన్ని తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ సలహాదారు వి.హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్యపరీక్షలు అందించేలా ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెల్త్ క్యాంప్లో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు, గుండె పరీక్షలు, రక్త పోటు, రక్తంలో చక్కెర స్థాయిల పరీక్షలు, డిజిటల్ ఐ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఆరోగ్యంపై తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా బాగ్ అంబర్పేట్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ శంభుల ఉష్శ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ పదేళ్లుగా శంభుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కరోనా సమయంలో ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందించి ప్రజలకు అండగా నిలిచామని గుర్తు చేశారు. గుండె శస్త్రచికిత్సలు తదితర వైద్య అవసరాలు ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం విద్యా సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు కృషిచేస్తామని ఉష్శ్రీ శ్రీకాంత్గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతా రోహిత్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఆర్.లక్ష్మణ్యాదవ్, పంజాల ధనుంజయ్ గౌడ్, వై.శంకర్ గౌడ్, రాంపల్లి జైహింద్, బింగి మల్లికార్జున్గౌడ్, పుల్ల శ్రీనివాస్, ఖైరతాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డం శ్రీధర్గౌడ్, బాగ్ అంబర్పేట్ డివిజన్ అధ్యక్షుడు రావుల సుధాకర్, ఈడెల్లి శ్యామ్ రావు, ఈడెల్లి ప్రభాకర్, చెంగల్ సుధాకర్, ఖైరతాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతమ్మ, జలంధర్, గోవర్ధన్గౌడ్, రమేష్గౌడ్, పంజాల సత్యప్రసాద్, పంజాల రామ్మోహన్గౌడ్, పుట్ట రాకేష్గౌడ్, గడ్డం అనిల్, జనగం రాము, సదానంద్, ప్రకాష్గౌడ్, ఓం ప్రకాష్, గడ్డం సునీల్, మహేందర్, చంద్రశేఖర్, సతీష్, షకీల్, మన్మోహన్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న హనుమంతరావు




మాట్లాడుతున్న స్వామి అంబార

## గ్రామీణ ప్రజల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను

## వెలుగులోకి తీసుకురావడమే ఇషా గ్రామోత్సం : స్వామి అంబార

**సైఫాబాద్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చి క్రీడాకారులుగా ప్రోత్సహించడమే ఇషా గ్రామోత్సవం లక్ష్యమని ఇషా ఫౌండేషన్ ప్రతినిధి స్వామి అంబార తెలిపారు. ఇషా గ్రామోత్సవం-2026 తెలంగాణ ఎడిషన్లో 9,630 మంది గ్రామీణ క్రీడాకారులు పాల్గొన్నారని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆదివారం బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో ఫౌండేషన్ ప్రతినిధి జలజ, క్రీడాకారులు ఉమా, జయలక్ష్మితో కలిసి అంబార మాట్లాడుతూ రాష్ట్రంలోని 15 జిల్లాల్లోని 25 ప్రాంతాల్లో నిర్వహించిన పోటీల్లో 843 జట్లు పాల్గొన్నాయన్నారు. ఇందులో పురుషుల వాలీబాల్లో 600 మంది, మహిళల త్రోబాల్లో 243 జట్లు పోటీపడ్డాయని, రాష్ట్ర ఫైనల్ను హైదరాబాద్లోని ఎల్బి స్టేడియంలో నేడు నిర్వహించడం జరిగిందన్నారు. క్లస్టర్ స్థాయిలో విజయం సాధించిన 28 జట్లు వాలీబాల్, త్రోబాల్లో తలపడ్డాయని, రాష్ట్రంనుంచి 4 జట్లు సెప్టెంబరు 4వ తేదీ నుంచి 6వరకు కోయంబత్తూరులో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటాయని ఆయన వివరించారు. ఖమ్మం జిల్లాకు చెందిన 84 ఏళ్ళ నరసమ్మ83 ఏళ్ళ కోటమ్మ ఈ ఏడాది గ్రామోత్సవంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. సద్గురు జగ్గి వాసుదేవ ఆధ్వర్యంలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పోటీలను నిర్వహిస్తూ గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తున్నామని, ఇషా గ్రామోత్సవానికి 'ఫిట్ ఇండియా' గుర్తింపుతోపాటు నేషనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ ఆర్గనైజేషన్గా గుర్తింపు లభించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఫైనల్ విజేతలకు 15 వేలు, రన్నర్స్కు 10 వేలు, రన్నరప్కు 10 వేలు, మూడో స్థానానికి 6 వేలు, 4వ స్థానానికి 4 వేలు నగదు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. గ్రాండ్ ఫినాలేలో కోటి రూపాయలు నగదు పురస్కారాలను అందజేస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో మీడియా కో-ఆర్డినేటర్లు పల్లవి, క్రాంతి పాల్గొన్నారు.

## వాజ్పేయికి ఘన నివాళి




అటల్ బిహారీ వాజపేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిజెపి నేతలు

**కార్వాన్, ఆగష్టు 16, ప్రభాతవార్త :** భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి 8వ వర్ధంతిని పురస్కరించుకొని గుడిమల్కాపూర్ డివిజన్లోని ఆకాష్ టెంట్ హౌస్ వద్ద బీజేపీ నిర్వహించిన కార్యక్రమంలో స్వర్గీయ అటల్ బిహారీ వాజపేయి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాలులర్పించారు. బిజెపి గోల్కొండ జిల్లా కార్యాలయ కార్యదర్శి కాంత్, నాయకులు రాదాకిషన్,నామ యాదగిరి, జి.శివరాజ్ యాదవ్, సురేందర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టింగ్ నిర్మూలనపై అవగాహన

**యూసుఫ్గూడ, ఆగస్టు 16, ప్రభాతవార్త :** ఎర్రగడ్డ మోడల్ రైతు బజార్లో ఆదివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు పూర్తిగా కెమికల్స్తో తయారుచేసిన నీలి కవర్ల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా లయన్ డి.వెంకట్ రమణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ ఓ మహమ్మారిఅని ఇది సామాన్య ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాజా పండ్లు, కూరగాయలు కొనుగోలుకు క్లాత్ బ్యాగ్లను వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చున్నారు. ఈసందర్భంగా పర్యావరణ పరరక్షణ సమితి చైర్మన్ కోటిరెడ్డి ఉచితంగా జ్యూట్ బ్యాగ్లను పంపిణీ చేశారు.

## రహమత్నగర్లో స్ట్రీట్ నంబర్లకు శాశ్వత పరిష్కారం



స్ట్రీట్నంబర్లను గూగుల్ మ్యాప్ పోస్టర్ను విడుదల చేస్తున్న సీఎన్రెడ్డి

**యూసుఫ్గూడ, ఆగస్టు 16, ప్రభాతవార్త :** దశాబ్దాల కాలంగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించటమే లక్ష్యంగా ప్రజల సూచనలు సలహాలతో రహమత్నగర్ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని మాజీ కార్పొరేటర్ సీఎన్రెడ్డి అన్నారు. ఆదివారం రహమత్నగర్ కాలనీలో స్ట్రీట్ నంబర్లు చిరునామాల గుర్తింపు, గూగుల్ మ్యాప్లను పొందుపర్చిన గోడ పత్రికను స్థానిక కాలనీ పెద్దలతో కలిసి విడుదల చేశారు. దశబ్దాల కాలంగా స్ట్రీట్ నంబర్లు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనికి శాశ్వత పరిష్కారం కోసం స్ట్రీట్ నంబర్ల క్రమద్దీకరణకు సంబంధించిన డ్రాఫ్ట్ను సీనియర్ నాయకులు, సీనియర్ సిటిజన్లు స్థానిక కాలని పెద్దల సమక్షంలో విడుదల చేయటం జరిగింది. ప్రస్తుం రహమత్నగర్లో స్ట్రీ నంబర్ 1 నుంచి 9 వరకు అవసరమైన చోట్ల సబ్ నంబర్లతో సహా ప్రతిపాదించటం జరిగింది. ప్రజల నుంచి వచ్చే సూచనలు సలహాలను పరిగణలోకి తీసుకుని సుమారు మూడు వారాలలో తుది డ్రాఫ్ట్ను సిద్ధం చేసి సంబంధింత అధికారులు గూగుల్ మ్యాప్లో స్ట్రీట్ నంబర్లను అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దీని ద్వారా ప్రతి వీధికి స్పష్టమైన నంబర్ ఉండి ప్రజలకు చిరునామా గుర్తింపు మరింత సులభతరం కానున్నది. ఈ స్ట్రీట్ నంబర్ల క్రమబద్దీకరణలో ముఖ్యపాత్ర పోషించిన మురళిని మాజీ కార్పొరేటర్ సీఎన్రెడ్డిని శాలువతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, సినయర్ సిటిజన్లు మల్లేష్, బుచ్చయ్య, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కావడి శోభా యాత్ర

**చార్మినార్, ఆగస్టు 16,ప్రభాతవార్త :** శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం భాగ్యనగర్ కావడి సీవా సంఘం ఆధ్వర్యంలో 29వ భవ్య కావడి శోభా యాత్ర అత్యంత వైభవంగా జరిగింది. చార్మినార్ మహాదేవ్ మందిరం నుంచి ప్రారంభమైన కావడి యాత్ర సరూర్ నగర్ లోని శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవస్థానం వరకు కొన సాగింది. ఈ కార్యక్రమంలో కావడి సేవా సంఘం ప్రతినిధులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చార్మినార్ వద్ద సాగుతున్న కావడి శోభయాత్ర